

గాలికి కిటికీ రెక్కలు చప్పుడు చేస్తూంటే తెలివొచ్చింది. మెల్లిగా కళ్లు తెరిచాను.

పండువెన్నెల, కదుల్తున్న పల్చటి తెరల్లోంచి పుచ్చపువ్వుల్ని గదిలోకి విసిరేస్తోంది.

# జీవితాన్ని ప్రేమించు

## గంటి భానుమతి

ఆ వెలుగులో ఎదురుగా గోడకి, సాయిబాబా పక్కనే స్థానం సంపాదించుకున్న రమేష్ ఫొటో పెద్దగా కొట్టొచ్చినట్టుగా కనబడ్తోంది.

మామగారి మాటలు చెవుల్లో ఇంకా గింగురుమంటున్నాయి.

“చచ్చిపోయిన వాళ్లని ప్రేమించడం, బతికి వున్నప్పటి కన్నా సులువు. ఎందుకో తెలుసామ్మా! గతానికి భవిష్యత్తుకన్నా క్లారిటీ ఎక్కువ. ఫొటోలు తప్పులు చెయ్యవు. తప్పులెన్నవు, వాదించవు...

''రోజులు గడిచేకొద్దీ.. రమేష్ తప్పులు మనం అంతా మర్చిపోతాం. గుర్తుచేసుకున్నప్పుడు వాడి తప్పులు పెద్దగా కనబడవు. అసలు వాటన్నింటినీ మర్చిపోతాం... అయితే దానికి కొంత సమయం పడ్తుంది. కాలం చాలా అద్భుతమైనదమ్మా! ఎలాంటి లోతైన గాయం అయినా మానిపోతుంది. అది కాలానికున్న మహత్తు.... అన్నీ సద్దుకుంటాయి. అప్పుడు రమేష్‌లో ఇన్నాళ్లు కనబడని మంచితనం కనిపిస్తుంది. .. వాడు మరీ అంత చెడ్డవాడు కాదు... భార్గవీ...

ఆశ్చర్యంగా మామగారివైపు చూశాను.

రోజులు గడిచేకొద్దీ రమేష్ మంచివాడెలా అవుతాడు? చరిత్రలో పురాణాల్లో ఎంతోమంది చెడ్డవాళ్లున్నారు. వాళ్లంతా మంచివాళ్లల్లాగా అయిపోయారా? మనం మంచి వాళ్లల్లాగా వాళ్లని గురించి చదవడం లేదే!

సమస్యల వలయంలో, అప్పుల ఊబిలో నన్ను పడేసి చిన్నపిల్లలిద్దర్నీ, వయసు మీరిన తల్లిదండ్రుల్నీ, వాళ్ల బాధ్యతల్ని నా మీద వేసి .. నీ తంటాలేవో నువ్వు పడు.. అని వెళ్లిపోయిన రమేష్ పలాయనవాదం.. కాలంతోబాటూ మారిపోతుందా?!

గుండెమూలల్లో తడి ఆరని మమత వాళ్లని అలా అననిస్తోంది. వాళ్లకి మాత్రం బాధలేదా! భర్తగా నాకు, కొడుకుగా వాళ్లకి అన్యాయం చేశాడు. కర్తవ్యం, ధర్మం, బాధ్యత.. అన్నీ కూడా మర్చిపోయాడు.

నన్ను ఊరడించడానికి ఏదో అంటున్నారే కానీ, ఆయన లోపల ఎంత కుమిలిపోతున్నారో... మానసికంగా ఎంతకృంగిపోతున్నారో గంటల తరబడి మౌనంగా శూన్యంలోకి చూసే విధానంలోనే అర్థం అవుతుంది.

రమేష్.. అగ్నిసాక్షిగా నన్ను పెళ్లాడిన రమేష్.. ఇదే గదిలో ఈ తిరుగుతున్న... ఇదే ఫాన్‌కి.. నా నైలాన్ చీరతో ఉరివేసుకున్నాడు...

ఒక్కసారిగా భయం వేసింది.

ఎలా పోతుంది నా భయం!

ఒక్కసారి శిరీష వస్తే బావుండును.

ఏడవడం ఒక్కటే నాకు మందు. అందుకు శిరీష భుజం కావాలి. కరువుతీరా ఏడవాలి.

కడుపులోని బాధ, గుండెల్లోని మంట... బయటకి రావాలి.

మళ్లా కళ్లకి ఫాన్ కనిపిస్తోంది.

ఫాన్‌కి వేళ్లాడుతున్న శవం రమేష్‌ది.

ఓ వైపుకి వాలిపోయిన తల

వేళ్లాడుతూ, ఊగుతున్న కాళ్లు, ఒళ్లు జలదరించింది.

శిరీష నాకు ధైర్యం చెప్పి అడుగు ముందుకు వేయిస్తుంది.

''ఇండియా వస్తున్నాను. .... ఓ పదిరోజుల్లో నీ ముందుంటాను. అంతవరకూ ధైర్యంగా వుండు. దానికి నీ చదువుని సార్థకం చేసుకుంటావని అనుకుంటాను.''

శిరీష... ఇంటర్ వరకూ నా క్లాస్‌మేట్. బెంగుళూరులో ఉంటోంది. ఇంజనీరింగ్ అక్కడే చేసింది. కొలీగ్‌తో పెళ్లయింది. ఉద్యోగరీత్యా, ప్రాజెక్ట్ పనిమీద అమెరికా వెళ్లింది. రమేష్ పోయినప్పుడు యిక్కడ లేదు.

రెండురోజుల క్రితం మళ్లా ఫోన్ చేసింది.

''బెంగుళూరు వచ్చాను. రేపు కానీ, ఎల్లుండికానీ నీ ముందుంటాను''

నా మనసు నాకన్నా శిరీషకే బాగా తెలుసు. వస్తుంది. ఆ ఓ మాటతోనే నాకు ఏదో మూల నుంచి తెలీని స్థైర్యం వచ్చినట్లనిపించింది.

చేత్తో తడిమి తలగడ పక్కనే వున్న గడియారం తీసి, ఆ గుడ్డివెలుగులోనే టైము చూశాను.

ఐదు.

తెల్లారుతోందన్నమాట.

శబ్దం చేయకుండా లేచి మొహం కడుక్కుని వంటింట్లోకి వెళ్లి లైటేశా.

ఈశాన్యంలో వున్న దేవుడి వైపు తిరిగి దండం పెట్టుకున్నాను.

రమేష్ ఆఫీసులోనే నాకు వచ్చిన ఉద్యోగంలో చేరడానికి కావలసిన ధైర్యం యివ్వమని ప్రార్థించాను.

ఫిల్టర్ వేస్తుంటే, అత్తయ్యగారు లేచి లోపలకి వచ్చారు.

దేవుడికి దండంపెట్టి, ఫ్రిజ్‌లోంచి పాలపేకెట్ తీసి గిన్నెలో పోశారు.

మా ఇద్దరి మధ్యా మాటలు తక్కువే.

ఆవిడపని ఆవిడది. నా పనినాది.

మా ఇద్దరి మధ్యా బంధం రమేష్‌తో వచ్చింది.

మా ఇద్దర్నీ పోషించేది రమేషే. ఆ కామన్ రమేష్ లేడు.

ఆ మాట రమేష్ పోయిన పదమూడో రోజునే అన్నారు.

''మన మధ్య వుండాల్సిన బంధుత్వం వుందంటే వుంది. లేదంటే లేదు. నేను, మీ మామయ్యగారు వెళ్లిపోదామనుకుంటున్నాం...''

ఉలిక్కిపడ్డాను. ''ఎక్కడికి?....''

చాలా కష్టం మీద మాటలు కూడదీసుకున్నారని నాకర్థం అయింది.

''మనవైపు ... ఏదో విధంగా కాలక్షేపం చేస్తాం...''

మా ఇద్దరికీ తెలుసు. కాలక్షేపానికి సరిఅయిన అర్థం .... ఎలా గడుస్తుంది? డబ్బెక్కడుంది? మామవగారికి ఆదాయం ఏం ఉంది?

అందుకే ఇద్దరం చాలాసేపు ఏడిచాం. ఆవిడ ఓ స్త్రీ. నేనూ ఓ స్త్రీ. అదే మా ఇద్దర్నీ దగ్గర చేసింది.

''మనమిద్దరం ఇప్పుడు అత్తాకోడళ్లం కాదు. నాకెవరూ లేరు. ఓ దిక్కు కావాలి. మీకు ఓ ఆధారం కావాలి. నేను మీ కోడల్ని కాకపోతానా?రమేష్ లేకపోతే. రమేష్ పిల్లలు మీ మనుమలు కాకపోతారా? ఇన్నాళ్ల కష్టం, నష్టం, సుఖం పంచుకున్నాం. ఇప్పుడు కూడా అలాగే వుందాం. ఒకళ్లకొకళ్లం. ఓ ఆలంబన, ఆ ఆశ్వాసన.

ఇంకేం అనకుండా నా దగ్గరే వుంటామన్నారు.

శిరీషకి ఫోన్ చేద్దామని అనుకుంటూండగానే, యింటిముందు ఆటో ఆగితే వంటింటి గుమ్మంలోంచే వీధిలోకి చూశాను.

సమస్యల వలయంలో, అప్పుల ఊబిలో నన్ను పడేసి చిన్నపిల్లలిద్దర్నీ, వయసు మీరిన తల్లిదండ్రుల్నీ, వాళ్ల బాధ్యతల్ని నా మీద వేసి .. నీ తంటాలేవో నువ్వు పడు.. అని వెళ్లిపోయిన రమేష్ పలాయనవాదం.. కాలంతోబాటూ మారిపోతుందా?!

శిరీష. బాగులోంచి డబ్బు తీసి డ్రైవర్‌కిస్తోంది.

ఒక్కసారి దాన్ని పట్టుకుని బావురుమన్నాను.

ఒకళ్ల కొకళ్లం చేతులు పట్టుకుని గదిలో మంచం మీద కూచున్నాం.

''అస్సలు నమ్మలేకపోతున్నాను భార్గవీ! రమేష్ ఇలా చేయగలడా? ఏం జరిగింది? ఆఫీసు గొడవలా? ఇంట్లో గొడవలా? ... చెప్పు...

నా గొంతు పెగల్లేదు. రెండుచేతుల్లో మొహం కప్పుకున్నాను.

చాలాసేపటి వరకూ ఏం మాట్లాడలేదు.

''అడుగుతున్నానని అనుకోకు. అసలేం జరిగింది? ముందురోజు ఏవైనా పోట్లాడుకున్నారా! ఏవైనా అన్నావా?....

విస్మయంగా శిరీషని చూశాను.

''నువ్వుకూడా ... ఇది నువ్వు అంటున్నావా! లోకం, పోలీసులు, అందరూ అదే మాట అడిగినా నేను అంత బాధపడలేదు. కానీ... నువ్వే...''

భుజం మీద చెయ్యేసి కొంగుతో నా చెంపలు తుడిచింది.

''సారీ... నిన్ను తప్పు పడ్తున్నానని కాదు. . అంత డ్రాస్టిక్ స్టెప్ ఎందుకు తీసుకున్నాడో ... అని కారణాలు... జస్ట్....

ఒక్కసారి డీలాపడిపోయాను.

శిరీష కూడా నా వైపు నుంచి ఆలోచించడం లేదు.

''ఏం అంటాను? అసలేం అనగలను? నేనోటి అంటే తనేం ఊరుకోడుకదా! యింకో నాలుగంటాడు. చేజేతులా నా మనసుని క్షోభపెట్టుకుంటానా?''

''మరి...''

అత్తయ్య రావడం చూసి నా నోరు మెదపలేదు.

ఆవిడ మౌనంగా కాఫీ అందించి వెళ్లిపోయింది. మా ప్రైవసీకి అడ్డురాకూడదని ఆవిడకి అనిపించి వుంటుంది.

''ఓ పెళ్లాంగా ఎందుకు? అని ప్రశ్నించే హక్కు భార్యకి లేదా? ఊళ్లో అప్పులు చేశారు. ఎలా తీరుస్తారు? ఎందుకు చేస్తారు అప్పులు? అని అడగటం తప్పా? పరిస్థితుల ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటే నేనెల్లా బ ధ్యురాల్ని అవుతాను? నువ్వే కాదు శిరీషా! అందరు అదే అనుకున్నారు. అదే అడిగారు.

''ఏం జరిగింది? పోట్లాడావా? సాధించావా? దెబ్బలాడావా? కొట్టావా? తిట్టావా? తన్నావా? ఎంత చీప్ అయిపోయాను? నా జీవితాన్ని తెరిచేసి, నలుగురి ముందు విసిరేసి, చదువుకోండి, ఆనందించండి.....అని వెళ్లిపోయాడు. ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది.

అత్తయ్య నీళ్లు తెచ్చి శిరీషకిచ్చారు. శిరీష నా చేతికిచ్చింది. నీళ్ల గ్లాసుని. నీళ్లు తాగి, కాఫీగ్లాసు పక్కనే పెట్టాను.

''కళ్లున్న ప్రతివాడూ చూడడం లేదా! చెప్పు... కాళ్లున్న ప్రతివాడు నడుస్తున్నాడు. నోరున్న ప్రతివాడు అన్యాయాన్ని ఎదిరిస్తున్నాడా? నువ్వు చెప్పు శిరీషా! ఇన్నేళ్లు ఊరుకుని ఇప్పుడు అడగడం తప్పయి

పోయింది. ఎక్కడపడితే అక్కడ వైన్ షాపులు, బార్‌లు. ఏదో ఓ వంక పెట్టి తాగి, ఇంట్లో ఎదుగుతున్న పిల్లల ముందు అసహ్యంగా ప్రవర్తించకండి అనడం తప్పా! సిటీ బాంకు వాళ్లు, మరో బ్యాంకు వాళ్లు యింటికొచ్చి పోతున్నారు అలా ఎందుకవుతోంది అని అనడం తప్పా?

"ఊరుకో! తప్పు నీది కాదు భార్గవీ! రమేష్‌దే.. ఏడవకు. ముందు ఏం చెయ్యాలో దాని గురించి చూడు... ఉద్యోగం ఇస్తానన్నారా రమేష్ కంపెనీ వాళ్లు.....

కళ్లు తుడుచుకుంటూనే తలూపాను.

ఈ లోపల పిల్లలిద్దరూ లేచి, బుద్ధిమంతుల్లాగా, కళ్లు నులుముకుంటూ, ఆవలిస్తూ, గదిలోంచి బయటికెళ్లిపోయారు.

"బయట అత్తయ్య వాళ్లకి స్నానం చేయిస్తుంది, బట్టలు వేస్తుంది అన్నం పెడ్తుంది. టిఫిన్ డబ్బాలు సర్ది ఇస్తుంది. మంచినీళ్ల సీసాల్లో పోస్తుంది. మామయ్యగారు స్కూలుకి తీసుకెళ్తారు. ఎంత బాధ్యత ఈ వయసులో తీసుకున్నారో, తల్చుకుంటే ఏడుపొస్తుంది...

"అలాగా..! ఆశ్చర్యంగా చూసింది.

"ఊఁ... రమేష్‌లో వున్నది ఈ రక్తమే కాదా! కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు మర్చిపోయి నన్ను మించి వాళ్లు చూస్తున్నారే, ఈ రమేష్‌కి ఆ మాత్రం తెలీకపోయిందే! ఈ పిల్లలు తనకేం కారా! తనకేం సంబంధం లేదా? కుటుంబం అంటే రమేష్ లేకున్నా ఫర్వాలేదనా; ఏమో శిరీషా! వీళ్ల చదువులు .... పెళ్లిళ్లు.... బాధ్యతలు ..... కుటుంబం నా ఒక్కదానికేనా; అసలు భర్తంటే ఎవరు? భరించేవాడు కాదా?

"వెంటనంటి, అన్ని విధాలుగా తోడుండాల్సిన మొగుడు తనదారి తాను చూసుకుంటే .. ఈ పెళ్లికి విలువేం లేదు.. ఈ మంత్రాలకి అర్థం లేదా? లేకపోతే అర్థం మారిపోయిందా? .... " అంటూ మళ్లా శిరీష భుజం మీద తల ఆన్చి ఏడవడం మొదలుపెట్టాను.

"వెంటనంటి, అన్ని విధాలుగా తోడుండాల్సిన మొగుడు తనదారి తాను చూసుకుంటే .. ఈ పెళ్లికి విలువేం లేదు.. ఈ మంత్రాలకి అర్థం లేదా? లేకపోతే అర్థం మారిపో యిందా? .... " అంటూ మళ్లా శిరీష భుజం మీద తల ఆన్చి ఏడవడం మొదలు పెట్టాను.

"కుటుంబాన్ని చిందరవందర చేసేసాడు. అల్లకల్లోలం చేశాడు."

"ఊరుకో! భార్గవీ... ఎంతసేపు ఏడుస్తావు... ఊరుకో... పిల్లలొచ్చారు"

పిల్లలిద్దరు తయారయిపోయి, స్కూలు బాగులతో సహా నా దగ్గరి కొచ్చారు.

ఇద్దర్ని ముద్దుపెట్టుకుని చెయ్యూపాను.

శిరీష కూడా అలాగే చేసి, కాడ్‌బరీస్ చాక్‌లెట్లు యిచ్చింది.

"పిల్లలకి జరుగుతున్నది, జరిగిపోయింది అర్థం అవుతోందా? స్కూల్లో...."

ఒక్కసారి కళ్లు తుడుచుకొని, మళ్లీ మంచినీళ్లు తాగాను.

"ఆ విషయంలో మాత్రం నేనదృష్టంతురాల్నే శిరీషా! ఎవరూ ఏమీ అనలేదు. స్కూల్లో టీచర్లు యింటికొచ్చి పిల్లల్ని బాగా చూసుకుంటామని, మెంటల్‌గా ఏ విధమైన భారం లేకుండా చేస్తామని అన్నారు. మామయ్యగారు వాళ్ల చదువులు చూస్తున్నారు. సాయంత్రం ఇక్కడే ఓ స్కూల్లో ట్యూటర్‌గా చేరారు. ఇక్కడే వున్న ఓ సెమీ రెసిడెన్షియల్ స్కూలుకి పచ్చళ్లు అందించడానికి అత్తయ్యగారు ఒప్పుకున్నారు... ఆర్థికంగా ఎంతో కొంత నాకు సాయం పడ్డామన్న వాళ్ల తపన, తాపత్రయం చూస్తుంటే ఏడుపొచ్చేస్తుంది.

"కన్నవాళ్లు, నీ తంటాలు నువ్వు పడు. మేమే కొడుకుల మీద ఆధారపడ్డవాళ్లం.. నీకేవిధంగానూ సాయపడలేము అని చెప్పి వెళ్లిపోయారు.... ఇప్పుడు నాకున్న పెద్ద దిక్కు.. వీళ్లే... వచ్చేవారం రమేష్ కంపెనీకెళ్లాలి. ఈ నెలరోజులు వీధి గుమ్మం చూళ్లేదు. అలాంటిది ఒక్కసారిగా... నలుగుర్లోకి వెళ్లి... " మళ్లీ ఒక్కసారి భోరుమన్నాను.

"ఊరుకో భార్గవీ! రమేష్ గురించి ఆలోచించకు. తనో పిరికివాడు...."

"అందరూ అదే అంటున్నారు. పిరికివాడు... పిరికివాడు. అని. పిరికివాడు ఎందుకవుతాడు? చాలా ధైర్యం ఉన్నవాడే. ఎంతధైర్యం లేకపోతే ఆత్మహత్య చేసుకుంటాడు?

"రమేష్ చూపించిన నరకాన్ని భరించలేక ఒక్కోసారి చచ్చిపోదామనిపించేది. పిల్లల మొహాలు చూస్తే, ధైర్యం, అంతా కన్నీళ్లలాగా మారిపోయేది. నేను పిరికిదాన్ని. చావడానికి ధైర్యం లేనిదాన్ని. ఈ అనుభవం ఎన్నోసార్లు. నా చావు రమేష్‌ని మారుస్తుందో లేదో కానీ, పిల్లల భవిష్యత్తుని పాడు చేస్తుంది. వాళ్లు పాడయిపోతారు. అలాంటప్పుడు నేను చచ్చిపోవడం ఎవరికి మేలు చేస్తుంది;? అనవసరంగా బాధ్యతారహితులుగా పిల్లల్ని తయారు చేసి సమాజం మీదికి వదిలేసినదాన్ని అవుతాను.. ఎలా ఆలోచించి ఆత్మహత్య చేసుకోవడమనుకునేదాన్ని. నేనూ పిరికిదాన్ని... రమేష్ కాదు...

"ఒద్దు భార్గవీ! అనవసరంగా ఆ ఆలోచన రానీకు. ఎంతపిచ్చిగా అయిపోతున్నావో! తల్లిగా నీ బాధ్యత ఏం లేదా! వాళ్ల బాల్యాన్ని చూడు. నీకన్నా మీ అత్తగారు మావగారు నయం. పిల్లల బాధ్యత ఈ వయసులో కూడా. ఎంత సులువుగా అంగీకరించారో. నువ్వు ఇంకా రమేష్‌ని అనడంలోనే రోజులు గడిపేస్తున్నావు. రమేష్‌కి ముందుచూపు లేనట్లే. నీక్కూడా ముందుచూపు మందగిస్తోందా? వర్తమానంలోకి రా! .... ధైర్యం తెచ్చుకో...."

"ఏం ధైర్యం.... ఏం చూసి తెచ్చుకోమంటావు? నా ఆనందాన్ని నా జీవితాన్ని ముక్కలు చేసే హక్కు ఈ రమేష్‌కి ఎవరిచ్చారు?" అని గట్టిగా అరిచాను.

అత్తయ్యా కొంగుకి చేతులు తుడుచుకుంటూ గబగబా వచ్చారు.

"ఏం జరిగింది?" అంటూ శిరీషని చూశారు.

"మానవ హక్కులు మానవ హక్కులు అంటూ ప్రపంచం అంతా దాని వెనకాలే పడ్తోంది. ఆ హక్కులు కేవలం మొగవాళ్లకేనా? పిల్లలకేనా? ఆడవాళ్లకి లేదా? మానవుల్లో స్త్రీలని చేర్చలేదా? ఇక్కడ ఆడమొగా తేడాలా? చెప్పు... ధైర్యం అని అందరూ తేలిగ్గా చెప్పేస్తున్నారు....

ఏదో అంటున్నాను. నాకే స్పష్టత లేదు. నాకు పిచ్చెక్కుతోందా? ఎందుకు ఆగలేకపోతున్నాను? ఏం మాట్లాడుతున్నాను?

"ఊర్కో... ఏవిటీ పిచ్చి? యిద్దరు చిన్నపిల్లల్ని, వాళ్లజీవితాల గురించి ఆలోచించు.. . " అంటూ కోపంగా భుజం ఊపింది.

"రోజు మేం ఇదే చెప్తున్నాం. ప్చ్! వినడం లేదు. ఎలాగో ఏమో అర్థం కావడం లేదు. వచ్చేవారం ఉద్యోగానికెళ్లాలి. నలుగురిలో తిరగాలి. ఎంతోమంది చూస్తారు. ఎన్నో అనుకుంటారు. ఎంతనచ్చజెప్తున్నా, వినిపించుకోవడం లేదు. మాపాటి గుండె దిటవు దానికి లేకపోతోంది. నువ్వేదాన్ని మామూలు మనిషిని చెయ్యి...

అత్తయ్య మాటలకి ఆశ్చర్యపడ్డాను. నేను మామూలు మనిషిగా లేనా? మానసిక రోగినయిపోయానా! నాకేం తెలీదే!

"లే! భార్గవీ! టైమ్ పదయింది. స్నానం చెయ్యి. తర్వాత మాట్లాడదాం" అంటూ శిరీష నా చేతిని లాగి మంచం దిగడంలో నాకు సాయం చేసింది. ఆగిపోయాను. శిరీషని ఆపాను.

"శిరీషా! వుండు. ముందు నాకీమాట చెప్పు.... " అంటూ ఆమె మొహంలోకి చూశాను.

"చెప్పు..."

"నేను పిచ్చిదాన్లా ప్రవర్తిస్తున్నానా?"

"ఊహుఁ.. కొంచెం డిప్రెషన్‌లో వున్నావు. అందుకని..."

కళ్లు మూసుకున్నాను.

"కావచ్చు... కొంచెం డిప్రెషన్ నన్ను అలా మాట్లాడిస్తోందేమో? కానీ, పిచ్చిదాన్ని కాదు. బాధ... అయోమయం... కన్‌ఫ్యూజన్.. ఏం చెయ్యాలో తెలీని స్థితి... అందుకే..."

"నిన్ను మేమంతా బాగా అర్థం చేసుకున్నాం. అందుకే నిన్ను మామూలు మనిషిని చెయ్యాలని అనుకుంటాం. నాకన్నా ఎక్కువ మీ అత్తగారికి మామగారికి వుంది."

మళ్లా మంచం మీద కూచుండిపోయాను.

"నిజమే. శిరీషా! అత్తగారు చాలా మంచి ఆవిడ."

"అర్థం అయిందా! ఒప్పుకున్నావు కదా, ఆవిడ మంచి మనిషి అని. మరి ఆవిణ్ణి కూడా ఎందుకు బాధపెడ్తావు? అందరూ కలసి పిల్లల్ని తీర్చిదిద్దండి."

మౌనంగానే అన్నీ ముగించుకుని మంచం ఎక్కి గోడకి ఆనుకుని కూర్చున్నాను.

చాలా సేపటికి శిరీష నా గదిలోకి వచ్చింది.

"ఏంటాలోచిస్తున్నావ్?" నా పక్కనే గోడకి చేరబడి కూచుంది.

"యింకేం ఆలోచిస్తాను చెప్పు.... ఈసమయంలో నాకేముంటుంది ఆలోచించడానికి? మిగిలిపోయిన జీవితం గురించి..."

భుజం మీద చెయ్యివేసి చిన్నగా ఓ దెబ్బ వేసింది.

"నిజమే... నువ్వు చెయ్యాల్సిందదే. కానీ.. అందులో నీ పిల్లలు ఓ భాగం.. అది నువ్వు బాగా గుర్తుపెట్టుకోవాలి. వాళ్ల గురించి కూడా ఆలోచించు. వాళ్ల చదువులు... భవిష్యత్తు... బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కూడా నీదే కదా!... స్వార్థంతో నీ గురించే ఆలోచించకు. వాళ్లు నీ జీవితంలో ఓ భాగం..."

''అదే కదా శిరీషా! నా బాధంతా అదే. నేనొక్క దాన్నే అయితే...''

''ఛ... అలా అనకు...'' నా తలని తన భుజానికి ఆనించుకుంది. నా కళ్లలోంచి నీళ్లు కారిపోతున్నాయి. సెల్ఫ్‌పిటీ. నా మీద నాకే జాలి.

'' ఏవిటిది భార్గవీ! ఎందుకిలా అయిపోతున్నావు? ఎన్నిరోజులు ఇలా ఏడుస్తుంటావు? జీవితం నీ ఒక్కదానివే కాదన్నావు.. నీ వెనకాల పిల్లలున్నారు. ధైర్యం తెచ్చుకోవాలి. నిజమే... రమేష్ బాధ్యతారహితంగా ప్రవర్తించి మీ జీవితాల్ని అస్తవ్యస్తం చేశాడు. నిజమే.. కానీ.. నువ్వు.. నువ్వేం చేస్తున్నావు... పరిస్థితులకి సరెండర్ అయి పోవడం లేదా?

జీవితం స్మూత్‌గా ఎవరికీ వుండదు. ప్రతిరోజూ ఓ యుద్ధం చెయ్యాల్సిందే. పోరాటం చేసినంత మాత్రాన గెలిచిపోతామా? అలా అనుకుంటే అది అవివేకం కాదా? చదువుకున్నదానివి. అయినా ఏం లాభం? ధైర్యం... ఆత్మస్థైర్యం రెండూ లేదు.. ఏడ్పు... బాధంతా గుండెల్లో అలా వుంచేస్తే పిచ్చిపడ్తుంది.

''నాకు తెలీకుండానే పిరికిదాన్నయి పోతున్నాను.''

నా మొహంలోకి చూస్తూ, నా కళ్లూ, చెంపలు తుడిచి జుట్టు సవరించింది.

''సోక్రటీస్ ప్లాటోకి, ప్లాటో అరిస్టాటిల్‌కి, అరిస్టాటిల్ అలెగ్జాండర్‌కి జ్ఞానాన్ని ట్రాన్స్‌ఫర్ చేస్తే... నువ్వు పిరికితనాన్ని పలాయన వాదాన్ని రమేష్ నుంచి నేర్చుకుని, నీ నుంచి, నీ పిల్లలకి అదో పెద్ద హెరిటేజ్‌లాగా ట్రాన్స్‌ఫర్ చేయడానికి సిద్ధంగా వున్నావు. వాళ్లు శాడిస్ట్‌ల్లాగా, మానసిక రోగుల్లాగా తయారయితే.. వాళ్ల జీవితాల్ని .. నువ్వు క్రికెట్ మాచ్ చూస్తున్నట్లుగా ఓ ప్రేక్షకురాలిలాగా అయిపోతావు. ఇలా వుంటుంది వాళ్ల భవిష్యత్తు. నువ్వు కనక అస్తమానం ఏడిచేసి రమేష్‌ని గట్టిగా తిట్టిపోస్తుంటే... ఆలోచించుకో .. వాళ్ల భవిష్యత్తు. వాళ్ల బాధ్యత నీ చేతిలో వుంది. నీ పిల్లల భవిష్యత్తుకి నువ్వు కస్టోడియన్‌వి.

నువ్వు నీ బాధ్యత మర్చిపోతే, రేపు నిన్ను వాళ్లు క్షమిస్తారా? పిల్లలు ఎలాంటి వాతావరణంలో పెరుగుతారో... అలాంటిదే నేర్చుకుంటారు. నువ్వు పొగిడితే. అప్రిషియేట్ చెయ్యడం నేర్చుకుంటారు. నువ్వు ప్రోత్సహిస్తే ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు. నువ్వు సెక్యూరిటీనిస్తే నమ్మకం ఏర్పరచుకుంటారు. నువ్వు లాలిస్తే ప్రేమను చూడటం నేర్చుకుంటారు .... చెప్పు... నీ పిల్లల్ని ఎలా వుంచాలనుకుంటున్నావో, ఏం చెయ్యాలనుకుంటున్నావో... అది నీ చేతుల్లో వుంది. కష్టాలకి, సుఖాలకి మధ్య సన్నవంతెన వుంటుంది. అది నీ వ్యక్తిత్వం. దాని మీద ఆధారపడి వుంటుంది వాళ్ల భవిష్యత్తు.

తనని తాను గౌరవించుకోలేనివాడు తన మీద సానుభూతి పెంచుకుంటాడు. సెల్ఫ్ పిటీ. అదేనువ్వు ప్రస్తుతం చేస్తున్నది, చేస్తున్నావు. ప్రపంచంలో అందరికీ వాళ్ల పన్లు వాళ్లకుంటాయి. ఒకవేళ పనిలేని వాళ్లు వున్నారనుకో.. నిన్ననరు కదా..

అయినా అందరికీ కూడా అస్తమానం అనేంత తీరిక వుండదు. ఒకవేళ అన్నారనుకో. అనుకోని ఈ సమయంలోనే నువ్వురాటు తేలాలి. కష్టమే దైవం.... వైఫల్యమే గురువు.. ఈ రెండు ఇచ్చినంత, నేర్పినంత అనుభవం మరేది నేర్పలేదు.

అయిపోయిన గతంతో జీవితాన్ని ఎందుకు సమాధి చేస్తావు? జీవితం అంటే నిన్నా ఇవ్వాళా కాదుగా. రేపు కూడా జీవితమే. ఇవ్వాళ చీకటిగా వుందని తిట్టుకోవడం అవివేకం కాదా! ఈ చీకటి శాశ్వతం కాదు. రేపు సూర్యోదయం అవుతుంది. దానికోసం ఈనాటి చీకటిని భరించు. అక్కడే నీ ధైర్యం పనిచేస్తుంది. ... ఆలోచించుకో.. ఆ పైన నీ ఇష్టం...''

రెండు రోజులు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. బెంగుళూరు వెళ్లిపోవడానికి తయారవుతోంది శిరీష చేతులు పట్టుకున్నాను.

''థాంక్యూ... శిరీషా! ఓ మంచి స్నేహితురాలివని పించావు. నెగటివ్ ఆలోచనలని తీసేయడానికే ప్రయత్నిస్తున్నాను. నా పిల్లల జీవితాల్ని, నా జీవితంతో, నా ఆలోచనలని వాళ్ల ఆలోచనలతో కావలించుకుంటాను. జీవితాన్ని కావలించుకుంటాను. రమేష్ లాగా ఉరితాడుని కాదు. చావుని కావలించుకోను....''

★

లగాన్, అర్మాన్, మున్నాభాయ్ ఎంబిబిఎస్ చిత్రాలలో తన అసమాన నటనా ప్రతిభను కనబరిచి అలా తెరచాటయిపోయిన గ్రేసీ సింగ్ గురించి ఎన్నో పుకార్లు వున్నాయి. ఇండస్ట్రీలో ఏవేమో చెవులు కొరుక్కుంటారు కానీ, నిజానికి- టివి రంగం నుంచి సినిమా తెర మీద మెరిసిన ఈ తార చాలా సింపుల్‌గా వుంటుంది. హుందాగా ప్రవర్తిస్తుంది. సినిమాలు హిట్ అవడం ఫట్ అవడం అనేది ఆ సినిమా 'రాత' మీద ఆధారపడివుంటుంది తప్ప నటీనటుల మీద కాదని తేల్చేసింది. డాక్టర్‌గా జనం తనని బాగా గుర్తుపెట్టుకుంది మున్నాభాయ్ చిత్రంలోనే అని చెప్తుంది. తన డ్రీమ్ రోల్స్ రెండే రెండట. ఒకటి షోలే లో హేమ మాలిని చేసిన బసంతి, రెండోది- గైడ్‌లో వహీదా .. వంటి పాత్రల్ని పోషించాలనుందంటూ ఆశపడ్తోందిట. మరి ఏ నిర్మాత గ్రేస్ చూపిస్తాడో చూడాలి.

